

కామారెడ్డిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

# జైజై గణేశా..!



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

కామారెడ్డి పట్టణంలో నవరాత్రి ఉత్సవాల్లో విశేష పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జనోత్సవం సోమవారం రాత్రి ప్రారంభమైంది. ఈ సందర్భంగా పట్టణం భక్తులతో జనసంద్రంగా మారింది. జైజై గణేశా..అంటూ నినాదాలతో హోరెత్తింది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగిన శోభాయాత్రలో నృత్యాలు, కేరింతలతో యువత సందడి చేశారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కామారెడ్డి



పూజలు చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ





కామారెడ్డిలో నృత్యాలు చేస్తున్న యువకులు

# గణేశ్ నిమజ్జనంలో అపశృతి

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 16: గణేశ్ నిమజ్జనోత్సవంలో అపశృతి చోటు చేసుకున్నది. వినాయక నిమజ్జనం కోసం వెళ్లిన ఓ యువకుడు చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డి పేట్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగారెడ్డిపేట్ గ్రామ ఎస్సీ కాలనీలో యువకులు ప్రతిష్ఠించిన వినాయకుడికి ఆదివారం నిమజ్జన శోభాయాత్ర ప్రారంభించి, గ్రామశివారులో ఉన్న పటేల్ చెరువులో సోమవారం ఉదయం నిమజ్జనం చేశారు. అనంతరం గ్రామానికి చేరుకున్న యువకులు బుజ్జిగారి రాకేశ్(25) కనిపించకపోవడంతో వెతకసాగారు. ఎక్కడా కనిపించకపోవడంతో అనుమానం వచ్చి చెరువులో గాలించగా రాకేశ్ మృతదేహం లభించింది. వ్యవసాయం చేసుకుంటూ జీవించే రాకేశ్ భార్య రెండేండ్ల క్రితం ఇదే చెరువులో పడి మృతిచెందింది. భార్యభర్తలిద్దరూ పటేల్ చెరువులోనే పడి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.









# ఏకోపాధ్యాయ బడి..

# పట్టించుకునే వారేరి!

- ఒకే గది.. ఐదు తరగతులు
- మొత్తం 11 మంది విద్యార్థులు
- అందని మధ్యాహ్న భోజనం
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు
- రేపల్లెవాడ పాఠశాల దుస్థితి



రేపల్లెవాడ ప్రాథమిక పాఠశాల

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 16: ఆ పాఠశాలలో స్వల్ప సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. కానీ వారికి మధ్యాహ్న భోజనం కూడా అందించలేని దుస్థితి నెలకొన్నది. ఇది ఎక్కడో ఏ మారుమూల ప్రాంతంలో ఉన్న గ్రామంలోని పాఠశాల అనుకుంటాం. ఎల్లారెడ్డి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న రేపల్లెవాడ గ్రామ ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఇది. గ్రామంలోని ఉన్న ప్రాథమిక పాఠశాల ఏకోపాధ్యాయ పాఠశాల కావడంతో, ఒకే గదిలో ఐదు తరగతులకు చెందిన విద్యార్థులను కూర్చుండబెట్టి ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నాడు. ఈ ఐదు తరగతులకు కలిపి మొత్తం 11 మంది విద్యార్థులు మాత్రమే ఉండడం గమనార్హం. ఉన్నది ఒక్క ఉపాధ్యాయుడు .. ఆయన చెప్పిందే పాఠం..... వచ్చిందే సమయం.... పర్యవేక్షించేవారు లేరు.. అడిగేవారులేరు..ఎందుకంటే ఉదయం 11 గంటలు అవుతున్నా ఉపాధ్యాయుడు తరగతి గదిలో విశ్రాంతి తీసుకుంటుండగా.. ఇంటర్వెల్ పేరుతో పిల్లలు బయట ఆడుకోవడం ఇందుకు నిదర్శనం. దీనికితోడు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఉన్న 11మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడం లేదు. ఈ విషయమై ఎంఈవో వెంకటేశంను సంప్రదించగా.. పాఠశాలలో తగినంత విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో వంట చేయడానికి ఎవరూ రావడంలేదని తెలిపారు. దీనిపై జిల్లా విద్యాధికారి స్పందించి చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పాఠశాలలో ఉన్న విద్యార్థులు

# తాళం వేసిన ఇంట్లో చోరీ

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 16 : నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామంలో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. కొన్ని రోజుల క్రితం ఇంటి యజమాని దూళి గంగారాం అనారోగ్యానికి గురై నిజామాబాద్ దవాఖానలో చేరాడు. ఇంటికి తాళం వేసి ఉండగా గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న రెండున్నర తులాల బంగారం, రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారని ఏఎస్సై వెంకట్రావ్ తెలిపారు. గంగారాం కుమారుడు దూళి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.











